## క్లుప్తంగా

### గ్రామాల్లో తొలగించని ఫ్లెక్సీలు



ఎన్నికల కోడ్ ఉన్నా గ్రామాల్లో తొలగించని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తూతూ మంత్రంగా అమలవుతోంది. గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పర్యవేక్షణ చేయవలసిన మండల అధికారులు పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో టీడీపీ, బీజేపీ ఫ్లెక్సీలు తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహనాల తనిఖీ ఫ్లెక్సీలు తొలగింపు విగ్రహాలకు ముసుగులు వేయటం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయకుండా చూడటం వంటి పనులు గ్రామ, మండల, జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా ఈ నిబంధనలు అమలు చేయకపోవడంతో పార్టీల ఫ్లెక్సీలు అలాగే ఉండిపోయాయి. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని వెంటనే తొలగించని పార్టీల ఫ్లెక్సీలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్ని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

### ముగిసిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. జనవరి 1నుంచి 31 వరకు ఉంగుటూరు టోలు ప్లాజా వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. క్విజ్, డ్రాయింగు, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏ మేనేజర్ టెక్ అన్సారి, ఎంఎస్వీ టీం లీడరు ఎన్‌హెచ్‌ఏ ఎం శ్రీనివాసరెడ్డి, సేఫ్ ప్రాజెక్టు మేనేజరు కె. బాలసుబ్రహ్మణ్యం, టోలు మేనేజరు ఇంతియాజ్, టీడీఆర్ రూట్ మేనేజర్ గంటాసురేష్ కుమార్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో వాసవీ మాతకు పూజలు



వాసవీమాత చిత్రపటానికి పూల మాలవేసి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

ఉంగుటూరు: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసవీమాత చిత్రపటానికి పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త శ్రీను, కార్యదర్శి గణేష్, నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త పుల్లేశ్వరరావు మహిళలు పాల్గొన్నారు.

### పాతూరు అండర్ బ్రిడ్జి ద్వారా వాహనాల రాకపోకలు



పాతూరు ఆర్‌యూబీ ద్వారా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

సాక్షి స్పందన

భీమడోలు: ఈనెల 21న గేట్లు మూసివేత... ప్రయాణానికి ఇక్కట్లు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో జనవరి 22 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మూసి వేయడం, అదే క్రమంలో పాతూరు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీనితో రెండు వైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీనితో భీమడోలు మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే ఆర్టీసీ, ఇతర భారీ వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేందుకు ఇబ్బందులు తప్పవంటూ సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పాతూరు ఆర్‌యూబీ ద్వారా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. దీనితో తాడేపల్లిగూడెం నుంచి వచ్చే భారీ వాహనాలు, ఆటోల ద్వారా ప్రయాణికులు పాతూరు బ్రిడ్జి ద్వారా భీమడోలు చేరుకుంటున్నారు.

# ఇక రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడు

- నేటి నుంచి భూ క్రయవిక్రయాలపై కొత్త భారాలు
- సామాన్య, మధ్యతరగతి వర్గాలకు షాక్
- భీమడోలు పరిధిలో 5 నుంచి 20 శాతం పెంపు



భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భీమడోలు: నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు అమాంతంగా పెరగనున్నాయి. గతం కన్నా 5 నుంచి 20 శాతం మేర కూటమి ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెంచేసి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచేందుకు సిద్ధమైంది. దీంతో పేదలు, సామాన్య ప్రజలు సొంతింటి కలపై నీళ్లు చల్లింది. అడ్డగోలుగా ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం బాదుడుతో ఖజానా నింపుకోవాలని సిద్ధపడింది. జాతీయ, రాష్ట్ర రహదారులున్న సాకుతో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు తడిసిమోపుడవుతున్న తరుణంలో మరోసారి పెంచి ప్రజలకు షాకిచ్చింది. భూములు, నివాస, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువలు ఒక్కసారిగా పెంచేయడంతో వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందుగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచబోమని కూటమి నేతలు ఇచ్చిన మాటలను కేవలం ఎనిమిది నెలల వ్యవధిలోనే తప్పుతూ జనంపై బాదుడుకు సిద్ధమయ్యారు. ప్రతి రెండేళ్లకు 5 నుంచి 10శాతం పెంపుదల అనివార్యం కాగా, ఆ చార్జీలు రెట్టింపు కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

**రిజిస్ట్రేషన్ల కోసం ఎదురు చేస్తున్న క్రయ విక్రయదారులు**

భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు, ఉంగుటూరు మండలాలకు చెందిన భూముల క్రయ, విక్రయదారులతో కార్యాలయాలు కిటకిటలాడాయి. గురువారం, శుక్రవారాలు చివరి రోజులు కావడం, పాత రేట్లతో రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉండడంతో క్రయ, విక్రయదారులతో ఒక్కసారిగా కార్యాలయాలు కిటకిటలాడాయి. ఇప్పటికే భూములు, నివాస ప్రాంతాలను కొనుగోలు చేసుకున్న వారు అగ్రిమెంట్లు రాసుకోవడంతో వారంతా గత్యంతరం లేక ఉరుకులు, పరుగులతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. సర్వర్ కాస్త సతాయించడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పత్రాలు చేత పట్టుకుని దస్తావేజు లేఖరుల కార్యాలయాల వద్ద పడిగాపులు కాసారు.

**రియల్ ఎస్టేట్ రంగం కుదేలు**

ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం తాజాగా పెంపుతో మరింత పతనమవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆకాశమే హద్దుగా భూముల ధరలు పెంచుకుంటూ నిర్ణయాలు తీసుకోవడంతో రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. వాస్తవానికి గత ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా వారి ఖాతాల్లో నగదును జమ చేసేది. దీనితో వారంతా ఆస్తిలను కొనుగోలు చేసుకునేందుకు చొరవ చూపేవారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో జీవనోపాధి కరువైంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లో 110 నుంచి 120లోపు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో రోజుకు 120కు రిజిస్ట్రేషన్లు వరకు జరిగేవని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు అంతంత మాత్రమేగానే ఉంటున్నాయని దస్తావేజు లేఖరులు చెబుతున్నారు.

**భీమడోలు రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆదాయం**

భీమడోలు రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్ల సమకూరుతోంది. ప్రతి రోజూ 30 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.10 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో సుమారు రూ.15 నుంచి రూ.20కోట్ల వరకు ఆదాయం వస్తుందని సమాచారం. చదరపు గజానికి గతంలో 1,200 నుంచి కాగా ప్రస్తుతం రూ.1,500కు రిజిస్ట్రేషన్ భారం పెరిగింది. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో ఎకరాకు భూమి కనిష్ఠంగా రూ.23లక్షల ఉన్న భూమికి ప్రస్తుతం రూ.24 లక్షలకు, ద్వారకాతిరుమలలో రూ.10లక్షల విలువ గల భూమి రూ.11లక్షలు, దెందులూరు మండలంలో రూ.23 లక్షల ఉన్న భూమి ప్రస్తుతం రూ.25లక్షలకు పెరిగింది. గతంలో దెందులూరు మండలంలోని రేట్ల సవరించకపోవడంతో ప్రస్తుతం పెరిగిందని చెబుతున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి లక్ష రూపాయలకు 6.5 శాతం స్టాంప్ డ్యూటీ, 0.5 శాతం ఫీజు, బదిలీ సుంకం పెరగనుంది .దీనితో ప్రభుత్వానికి ఏడాదికి రూ.2కోట్ల మేరకు అదనంగా ఆదాయం వస్తుంది.

**రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గింది**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని భూములు రిజిస్ట్రేషన్ చార్జీలు 5 నుంచి 20శాతం వరకు పెరుగుతున్నాయి. లేఅవుట్ల భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెద్దగా పెరగలేదు. గతంలో రహదారులను దృష్టిని ఉంచుకుని చార్జీలు పెంచారు. గతంలో పోల్చితే రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గింది.

– టి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, భీమడోలు



దస్తావేజు లేఖరుల కార్యాలయం వద్ద క్రయ, విక్రయదారులు



రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఫలితంగా గ్రామాల్లో పట్టభద్రుల ఎన్నిక కోలాహలం మొదలైంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 6,060 మంది పట్టుభద్రులు ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 2,336 మంది, పురుష ఓటర్లు 3,724 మంది ఓటర్లు ఉన్నారు. ఇతరులు ఒకరు ఉన్నారు. ఉంగుటూరు మండలంలో 1,627 మంది ఓటర్లు, భీమడోలు మండలంలో 1,606 మంది, నిడమర్రు మండలంలో 950 మంది, గణపవరం మండలంలో 1,877 మంది, పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. 28వ తేదీ రాత్రి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉంగుటూరు మండలంలో మూడు పోలింగు కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. 318, 319, 320 పోలింగు కేంద్రాలు మండల కేంద్రమైన ఉంగుటూరు హైస్కూలు, పంచాయతీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేశారు. 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న పరిశీలన, 13న ఉపసంహరణ చేయవచ్చు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న కౌంటింగు నిర్వహిస్తారని ఎన్నికల డీటీ పోతురాజు వెల్లడించారు.

### భూసమస్యలు పరిష్కరించాలి

భీమడోలు: ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు లేని గిరిజనులు ఇల్లు వేసుకుని నివాసముంటున్నవారిపై భూస్వా మి కరాటం సునీల్ జేసీబీలతో కూలగొట్టడానికి ప్రయత్నించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు, భీమడోలు ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. కరాటం సునీల్ అనే భూస్వామి చట్టాన్ని ఉల్లంఘించి భూమిని ఆక్రమించుకుని సాగు చేయడమే కాకుండా గిరిజనుల ఇళ్లను తొలగించారని అన్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం భూస్వామికి కొమ్ము కాయడం దుర్మార్గమన్నారు. మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇతర గిరిజనులపై దౌర్జన్యం చేసి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం భూ సమస్యలు, ఇళ్ల సమస్యలపై జోక్యం చేసుకుని శాంతియుతంగా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# పోలీస్ సేవలు అభినందనీయం



పోలీస్ అధికారులను సత్కరించిన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, సంఘం ప్రతినిధులు



హోంగార్డులను సత్కరించిన అదనపు ఎస్పీ, పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి, నిబద్ధతతో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు, హోంగార్డుల సేవలు అభినందనీయమని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఏలూరు సీసీఎస్ ఎస్సై ఏసీహెచ్ శేఖర్, టూటౌన్ ఏఎస్సై టి.బ్రహ్మానందం, పెదవేగి ఏఎస్సై బీవీఎస్ మూర్తి, హోంగార్డులు చుక్క మోషే, ఎన్ ఏసుబాబు, జి.దేవదాసు, సీహెచ్‌వీ బ్రహ్మయ్యలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. వీరికి అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హోంగార్డు యూనిట్ ఇన్‌చార్జి ఆర్‌ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం సంయుక్త కార్యదర్శి శానం రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

### శతాధిక వృద్ధురాలి మృతి

దెందులూరు: దెందులూరులో శతాధిక వృద్ధురాలు మాదే రంగమ్మ (101) శుక్రవారం ఆమె నివాసంలో మృతి చెందింది. ఆమెకు ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కొడుకులు ఉన్నారు. జీవించి ఉన్నంత కాలం ఎంతో ఆరోగ్యంగా తన పనులు తాను చేసుకుంటూ ఉండేదని వారి కుమారులు తెలిపారు.

### పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 11,370 మంది పెన్షన్‌దారులకు రూ.4,92,48,000 మంజూరయ్యాయని ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. ఈమేరకు పింఛన్ల పంపిణీకి అధికారులను నియమించామని డబ్బు డ్రా చేసి సిద్ధంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు శనివారం వేకువ జాము నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. సోమవారం కూడా పింఛన్లు పంపిణీ చేస్తారని రాజ్‌మనోజు వివరించారు.

### పిల్లలను పాఠశాలలకు పంపించండి

ఏలూరు (టూటౌన్): పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ తల్లిదండ్రులను కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ నగర్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ అనంతరం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చి బాగా చదువుకోవాలని సూచించారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జి.నాగేశ్వరావు, డీసీపీఓ సూర్య చక్రవేణి, సీఐ ఎ.సత్యనారాయణ మాట్లాడారు. ఏఎల్ఎస్ఏ కో ఆర్డినేటర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు జీజేఏ స్టీవెన్, జరీనా, కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు




ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పాలిట కొంగు బంగారంగా సంతాన లక్ష్మిగా, చల్లని తల్లిగా పేరొందిన దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను ఫిబ్రవరి 4వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఇప్పటికే ఆలయం చుట్టూ భారీగా వివిధ రకరకాల విద్యుదీపాలు అలంకరించి చిత్ర విచిత్ర ఆకర్షణతో ఉండే బొమ్మలతోపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటితోపాటు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కమిటీ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను ఫిబ్రవరి 4న ఉత్సవాల సందర్భంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని మంగళవారం 4 తేదీ పసుపుతో అలంకరణ, 5న నిమ్మకాయలు, పసుపు కుంకుమార్చన, శుక్రవారం గాజులతో, శనివారం గంధంతో, ఆదివారం నెమలి పింఛంతో, సోమవారం పూలతో ప్రత్యేక అలంకరణ, మంగళవారం గాలాయగూడెం గ్రామ దేవత గ్రామ పుట్టింటి చీరతో అలంకరణ, 12న ఆఖరి రోజు రకరకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద రకరకాల విద్యుత్ కాంతులతో డిజిటల్ లైట్లను ఏర్పాటు చేశారు. పెదవేగి సీఐ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారని, ఆలయంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం అమ్మవారికి విశిష్ట అలంకరణ చేసి పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న కమిటీ సభ్యులు



ఉత్సవాలకు సిద్ధమైన మండపం

### సంస్కరణలకు వ్యతిరేకంగా నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అఖిల భారత విద్యాహక్కువేదిక పిలుపులో భాగంగా ఏపీఎస్‌ఈసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీఎస్ఈసీ భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాలైన ఏపీటీఎఫ్ 1938, డీటీఎఫ్, విద్యార్థి సంఘాలైన పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీకి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌కే బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎకో గ్రీన్ యూనిట్ సంస్థ కృషి చేస్తోందని తమిళనాడులోని కోయంబత్తూరు పరిశ్రమల అభివృద్ధి అధికారి ఎస్‌కే బాబు అన్నారు. స్థానిక కందకం వీధిలో మహిళలకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 17 రాష్ట్రాల్లో ఎకో గ్రీన్ యూనిట్ ఆరికా లీఫ్ ప్లేట్ల తయారీ ప్రాజెక్ట్, బనానా ఫైబర్ ప్రాజెక్ట్, హస్తకళల ప్రాజెక్ట్, వెదురు హస్తకళల తయారీ ప్రాజెక్ట్, కొబ్బరి చిప్పల క్రాఫ్స్ తయారీ ప్రాజెక్ట్, కోయిర్ కుండీల తయారీ ప్రాజెక్ట్, బయోదార్ మేకింగ్ ప్రాజెక్ట్, లావంచ సాగు ప్రాజెక్టులపై రైతులు, మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఆయా ప్రాజెక్టులకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ, మార్కెటింగ్ పరంగా మద్దతు ఇస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, ముద్రా బ్యాంకు పథకం, వివిధ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్కీమ్‌ల ద్వారా బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొర్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

# కాలువ గట్లపై భారీ వృక్షాలు మాయం

- ఆరు దశాబ్దాల నాటి వృక్షాలు నరికివేత
- పర్యావరణానికి పెనుముప్పు
- కాలువలోకి వాలిన కొమ్మలు నరికామంటున్న ఇరిగేషన్ శాఖ అధికారులు



ఉంగుటూరు కాలువగట్టుపై చెట్లు నరికేసిన దృశ్యం



నారాయణపురం వద్ద గోదావరి కాలువగట్టుపై నరికేసిన చెట్లు

ఉంగుటూరు: పర్యావరణానికి పెనుముప్పు ఉందని తెల్సినా చెట్లు నరికేయడం జరుగుతోంది. ఇటీవల కాలంలో ఉంగుటూరు మండలంలో ఎక్కడ బడితే అక్కడ చెట్లు నరికేస్తున్నారు. తీగలు అడ్డువచ్చాయని విద్యుత్ శాఖ వారు కొన్ని చెట్లును నరికేస్తుంటే, కాలువలోకి కొమ్మలు వాలిపోయాయని ఇరిగేషన్ శాఖ వారు చెట్లను నరికేస్తున్నారు. ఆరుదశాబ్దాలు పైనే వయస్సున్నమాను చెట్లు సైతం కనికరం లేకుండా మానుచెట్లును ఏలూరు కాలువ గట్టుపై నరికేసారు.ఇష్టానుసారంగా చెట్లు నరికేసి పట్టుకుపోతుంటే అడిగిన వారే కరవు అయ్యారు. 60 సంవత్సరాలు పైబడి పెరిగిన చెట్లును ఇప్పుడు నరికేస్తున్నారు. కొందరు రాత్రికి రాత్రే వాటిని పట్టుకుపోతున్నారు. వీటిమీద అజమాయిషీ కరువయ్యింది. ఉప్పాకపాడు నుంచి కై కరం శివారు టన్నెల్ వరకు గోదావరి కాలువ ఉంగుటూరు మండలంలో విస్తరించి ఉంది. ఈ గట్ల మీద ఎన్నో చెట్లు పెరిగి పెద్ద వృక్షాలుగా మారాయి. ఈ వృక్షాలు ప్రయాణికులకు చల్లని నీడను, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని అందజేస్తున్నాయి. విచక్షణారహితంగా నరికేసిన చెట్ల మోడులను చూసి పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉంగుటూరు మండలంలో ఎక్కడ బడితే అక్కడ ప్రభుత్వ స్థలాల్లో పెరిగిన చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది, రాజకీయ నాయకుల అండతో మరి కొందరు నరికేస్తున్నారు.

**పర్యావరణానికి విఘాతం**



భవిష్యత్తు తరాలకు అవసరమైన ఆహ్లాదకర పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. విచక్షణారహితంగా చెట్లు నరికేస్తే పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉన్నట్లే. చెట్లు నరుకుంటూ పోతే భవిష్యత్తు తరాలకు సచ్ఛమైన గాలి ఉండదు. స్వార్థ ప్రయోజనాలకోసం పర్యావరణానికి విఘాతం కలిగించొద్దు. 70 ఏళ్ల నుంచి ఉన్న చెట్లను నరికేయడం అన్యాయం. – కొరిపల్లి వెంకట అప్పారావు, ఉంగుటూరు

**ఆక్సిజన్‌ను కొనుక్కోవాల్సి వస్తుంది**



ప్రస్తుతం మంచినీళ్లు కొన్నట్లే ఆక్సిజన్‌ను కూడా కొనుక్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉంది. ఒకప్పుడు కాలువల్లో, బోదెల్లో సహజ సిద్ధమైన నీటిని రైతులు, ప్రయాణికులు తాగేవారు. అలాంటిది ఇప్పుడు మినరల్, ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నాము. ఇలాగే చెట్లు నరికేస్తే వాతావరణం కలుషితమై విపత్కర పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

– పొంద్రాకుల శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త, ఉంగుటూరు

**కలప వేలం వేస్తాం**



మాను చెట్ల ఎక్కడా నరకడం లేదు. కాలవలోకి చెట్టు కొమ్మలు వాలాయని వాటిని మాత్రమే నరికించాల్సి వచ్చింది. నరికన చెట్ల కొమ్మలను, కలపను ఎవరూ పట్టుకు వెళ్లడం లేదు. ఈ చెట్ల కొమ్మలకు వేలం వేయడంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అనుమతి రాగానే వాటిని వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేస్తాం.

– సుధారాణి, ఇరిగేషన్ ఏఈ, తాడేపల్లిగూడెం